



# సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
EVENING EDITION
www.suryaa.com పేజీలు: 02 4PM


బంగారం ధర ₹63,380 10 GRMS 24 CARAT
వెండి ధర 1KG 78,000
సెన్సెక్స్ 71,868 ↑507
నిఫ్టి 21,660 ↑143
చికెన్ ధర 1KG ₹210
గుడ్ల ధరలు డజన్ ₹70

# నెలాఖరులోగా మరో హామీ అమలు!

## మహిళలకు ప్రతినెలా రూ.2,500రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు



మరో హామీ అమలుపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మహాలక్ష్మి పథకం కింద అర్హులైన మహిళలకు ప్రతినెలా రూ.2,500 చెల్లించే కార్యక్రమానికి ఈ నెలాఖరులోగా శ్రీకారం చుట్టనున్నట్లు తెలిసింది. అధికారంలోకి వస్తే.. 6 గ్యారంటీలను అమలు చేస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రకటించింది. అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన రోజే గ్యారంటీల అమలుకు సంబంధించిన ముసాయిదాపై సంతకం చేశారు. ఇందులో మొదటి గ్యారంటీ.. మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఆరో గ్యారంటీ అయిన చేయూతలో రూ.10 లక్షలతో రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమాను అమలు చేసింది. ఇప్పుడు మహాలక్ష్మి పథకం కిందనే ప్రతినెలా మహిళలకు రూ.2,500 చొప్పున ఇస్తామన్న హామీని అమలు చేయడానికి కసరత్తు చేస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ రాకముందే అమలు చేయడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్థిక శాఖతో చర్చించినట్లు సమాచారం. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని అమలు చేస్తుండగా, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లోనూ అమల్లో ఉన్న ఇలాంటి పథకాలను అధ్యయనం చేసి ప్రతినెలా ఎంత అవసరమవుతుందో నివేదించాలని సూచించినట్లు సమాచారం. కర్ణాటకలో దాదాపు మూడున్నర కోట్ల మంది మహిళలుండగా, కోటీ 25 లక్షల మందికి చెల్లిస్తున్నట్లు సమాచారం. అక్కడ ఇచ్చే ప్రాతిపదికన ఇక్కడ కూడా చెల్లిస్తే ఎంతమందికి ఇవ్వాల్సి వస్తుందన్నదానిపై కసరత్తు చేస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. 30 లక్షల మంది మహిళలకు చెల్లించాలంటే ప్రతినెలా రూ.750 కోట్లు అవసరం. 40 లక్షల మందికి చెల్లించాలంటే రూ.వెయ్యి కోట్లు.. 60 లక్షల మందికి అయితే ప్రతినెలా రూ.1,500 కోట్లు అవసరం. అర్హతలతోపాటు ఆర్థిక పరిస్థితిని కూడా పరిగణనలోకి తీసుకొని ఈ నెలాఖరులోగా ఈ పథకం అమలుకు శ్రీకారం చుట్టడానికి కసరత్తు చేస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.



## కేసీఆర్‌ను పరామర్శించిన ఏపీ సీఎం జగన్

హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇంటికి ఏపీ సీఎం జగన్ చేరుకున్నారు. ఇంటి వద్ద జగన్‌కు కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లు స్వాగతం పలికారు. ఫామ్‌హౌజ్‌లో కిందపడిన కేసీఆర్‌ను జగన్ పరామర్శించారు. ఆయన ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కేసీఆర్ ఇంటి వద్దే జగన్ భోజనం చేసి.. అనంతరం తాడేపల్లికి వెళ్తారని తెలుస్తోంది.



## ఢిల్లీకి బయలుదేరిన సీఎం రేవంత్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఢిల్లీకి బయలుదేరారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ పూర్తిగా ప్రభుత్వ అధికారిక భేటీల్లో పాల్గొననున్నారు. ఇక, సీఎం రేవంత్ వెంట సీఎస్, డీజీపీ అధికారుల బృందం సైతం బయలుదేరింది. వివరాల ప్రకారం.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ఉదయం హైదరాబాద్ నుంచి ఢిల్లీలోకి బయలుదేరారు. ఈ పర్యటనలో భాగంగా ఫైనాన్స్, హెల్త్, ఇరిగేషన్, పరిశ్రమలతో పాటు పలు అంశాలపై కేంద్ర ప్రభుత్వ అధికారులతో సీఎం రేవంత్, అధికారుల బృందం భేటీ కానున్నారు. పలువురు కేంద్ర మంత్రులతో సైతం రేవంత్ సమావేశం కానున్నట్టు సమాచారం. కాగా, సీఎం రేవంత్ షెడ్యూల్ పూర్తి అయితే ఈరోజు సాయంత్రమే వీరంతా తెలంగాణకు తిరుగు ప్రయాణం కానున్నారు.



## ఢిల్లీ ఎయిమ్స్‌లో అగ్ని ప్రమాదం

ఢిల్లీ ఎయిమ్స్‌లోని ఎయిమ్స్ డైరెక్టర్ కార్యాలయంలో ఈరోజు (గురువారం) ఉదయం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. దీంతో ఎయిమ్స్‌లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ఎయిమ్స్ డైరెక్టర్ కార్యాలయంలో చెలరేగిన మంటలకు సంబంధించిన సమాచారం అందగానే అగ్నిమాపకదళం ఏడు అగ్నిమాపక యంత్రాలతో సహా సంఘటనా స్థలానికి చేరుకుంది. మంటలను అదుపు చేసే ప్రయత్నాలు ముమ్మరంగా జరిగాయి. అగ్నిమాపక శాఖ తెలిపిన వివరాల ప్రకారం ఈరోజు (గురువారం) తెల్లవారుజామున 5:58 గంటల ప్రాంతంలో ఎయిమ్స్ ఆసుపత్రిలో చోటుచేసుకున్న అగ్నిప్రమాదానికి సంబంధించిన సమాచారం అందింది. వెంటనే ఏడు అగ్నిమాపక వాహనాలను సంఘటనా స్థలానికి తరలివెళ్లాయి. ఎయిమ్స్‌లోని ఓ కార్యాలయంలో మంటలు చెలరేగాయి. డైరెక్టర్ బిల్డింగ్ రెండో అంతస్తులోని ఆఫీసు రికార్డులు, ఫర్నీచర్, రిఫ్రిజిరేటర్‌లో మంటలు చెలరేగినట్లు సమాచారం. ఈ అగ్ని ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అగ్నిమాపక శాఖ తెలిపింది. ప్రస్తుతం మంటలు అదుపులోకి వచ్చాయి.



## ఢిల్లీలో స్కూల్స్ బంద్, విమానాలు ఆలస్యం

ఉత్తరాదిన పొగమంచు తీవ్ర ప్రభావం చూపుతోంది. భారీగా కురుస్తున్న పొగమంచు కారణంగా విమానాలు, రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. పొగమంచు కారణంగా పలు చోట్ల విద్యాసంస్థలను సెలవు కూడా ప్రకటించారు. ఇక, వాహనదారులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక, ఐఎండీ అంచనాల ప్రకారం.. మరో రెండు రోజులు కూడా ఈ చలి ఉష్ణోగ్రతలు ఉండే అవకాశం ఉంది. ఉత్తరాదితోపాటు తూర్పు భారతదేశంలో కూడా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అధికారులు తెలిపారు. రానున్న రెండు, మూడు రోజుల్లో 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ వరకు పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు. ఇక మధ్య భారతంలో చలి తీవ్రత రాబోయే మూడు రోజులు ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది. వివరాల ప్రకారం.. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, చండీగఢ్, రాజస్థాన్, బీహార్, మధ్యప్రదేశ్, త్రిపుర, జమ్మూ ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు అలుముకుంది. గురువారం తెల్లవారుజాము నుంచే దట్టమైన పొగమంచు కమ్ముకుంది.



# కాంగ్రెస్‌లో చేరిన వైఎస్ షర్మిల

## కాంగ్రెస్ పార్టీలో వైఎస్సార్‌టీపీ విలీనం

## కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఖర్గే, రాహుల్

ఎట్టకేలకు వైఎస్సార్టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం ఉదయం ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సమక్షంలో షర్మిల కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. షర్మిల చేరికతో కాంగ్రెస్ పార్టీలో వైఎస్సార్టీపీ విలీనం అయ్యింది. కాంగ్రెస్‌లో వైఎస్సార్టీపీని విలీనం చేసినందుకు చాలా సంతోషంగా ఉందని ఈ సందర్భంగా షర్మిల చెప్పుకొచ్చారు. కాంగ్రెపార్టీ ఏ బాధ్యత ఇచ్చినా నిబద్ధతో పనిచేస్తానని షర్మిల స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ కాంగ్రెస్ ఇంచార్జ్ మాణిక్యం ఠాగూర్, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పీసీసీ ప్రెసిడెంట్ రుద్రరాజు, పలువురు నేతలు పాల్గొన్నారు. కాంగ్రెస్‌లో షర్మిల చేరిన నేపథ్యంలో ఆమెకు పార్టీ ఏ బాధ్యతలు అప్పగిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఏఐసీసీలో పదవి ఇస్తారా? ఏపీ కాంగ్రెస్ బాధ్యతలు అప్పగిస్తారా? అనేదానిపై జోరుగా ఊహాగానాలు కొనసాగుతున్నాయి.

**అనంతరం మాట్లాడిన వైఎస్ షర్మిల..** కాంగ్రెస్ పార్టీలో విలీనం చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. తన తండ్రి వైఎస్సార్ జీవితమంతా కాంగ్రెస్ పార్టీ కోసం పని చేశారన్నారు. తాను కూడా నాన్న వైఎస్ అడుగు జాడల్లో నడుస్తున్నానని చెప్పారు. దేశంలో అతిపెద్ద సెక్యులర్ పార్టీ కాంగ్రెస్ పార్టీ అని.. అన్ని వర్గాలను కాంగ్రెస్ ఏకం చేసిందని వ్యాఖ్యనించారు. మణిపూర్‌లో 2 వేల చర్చిలు ధ్వంసం చేసిన ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందని చెప్పారు. కేంద్రంలో సెక్యులర్ పార్టీ లేనందునే ఇలాంటి ఘోరం జరిగిందన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిగా చూడటమే వైఎస్ కల అని.. దాని కోసం తన వంతుగా కృషి చేస్తానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఏ బాధ్యతలు అప్పగించినా విధేయతో నిర్వర్తిస్తానని అన్నారు.

**రాష్ట్ర సారథ్యం అప్పగించేందుకే రాహుల్ మొగ్గు!**

కాంగ్రెస్‌లో చేరిన షర్మిలకు ఆంధ్ర పీసీసీ పగ్గాలు అప్పగించేందుకే రాహుల్ మొగ్గు చూపుతున్నారు. ఇటీవల ఢిల్లీలో రాష్ట్ర నేతలతో జరిగిన సమావేశంలో.. ఆయన, మల్లికార్జునఖర్గే ప్రత్యేకంగా షర్మిల ప్రస్తావన తీసుకొచ్చారు. రాష్ట్రానికి చెందిన ఇద్దరు మాజీ ఎంపీలు తప్ప ఆమె రాకను అందరూ స్వాగతించారు. పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు తన అభిప్రాయాన్ని వెల్లడిస్తుండగా.. రాహుల్ జోక్యం చేసుకుని.. రాష్ట్ర కాంగ్రెస్‌లో షర్మిలకు ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు.




**షర్మిల రాజకీయ ప్రస్థానం..**

వైఎస్ మరణం తర్వాత... జగన్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించగా షర్మిల ఆ పార్టీలో కీలకంగా వ్యవహరించారు. ఉమ్మడి ఏపీలో జగన్ జైలుకు వెళ్లిన సమయంలో పార్టీని భుజాలకెత్తుకొని రాష్ట్వవ్యాప్తంగా పాదయాత్ర చేశారు. 2019లో ఏపీలో వైసీపీ అధికారంలోకి తీసుకురావటం కోసం కష్టపడి పని చేశారు. 2020 వరకు ఆమె వైసీపీలో కొనసాగగా.. అనుహ్యంగా తెలంగాణ రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. తాను తెలంగాణ బిడ్డనే అని.. రాజన్న రాజ్యం స్థాపనే లక్ష్యమంటూ 2021 జులై 8న వైఎస్సార్ తెలంగాణ పార్టీ పేరుతో కొత్త పార్టీని ప్రకటించారు. అనంతరం తెలంగాణ వ్యాప్తంగా పాదయాత్ర చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తారని.. తాను పాలేరు నుంచి బరిలోకి దిగుతానని చెప్పారు. అయితే ఎన్నికలకు ముందు అనుహ్యంగా పోటీ నుంచి తప్పకున్నారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదనే ఉద్దేశ్యంతో తమ పార్టీ పోటీ నుంచి తప్పకుటుంటుందని ప్రకటించారు. ఇదే సమయంలో హస్తం పెద్దలతో టచ్‌లోకి వెళ్లారు. హస్తిన వెళ్లి సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో చర్చలు కూడా జరిపారు. ఆ చర్చల ప్రధాన ఉద్దేశ్యం పార్టీ విలీనం.. మొదట్లో ఈ విలీన ప్రతిపాదన వార్తలను షర్మిల ఖండిస్తూ వచ్చినప్పటికీ.. ఆ తర్వాత పరోక్షంగా విలీనానికి ఓకే చెప్పారు. ఇవాళ అధికారికంగా వైఎస్ఆర్టీపీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేసి కాంగ్రెస్ కండువా కప్పకున్నారు.




## శ్రీకాకుళంలో 'నిజం గెలవాలి' యాత్ర ప్రారంభం

జిల్లాలో టీడీపీ చీఫ్ చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి చేపట్టిన "నిజం గెలవాలి" యాత్ర ప్రారంభమైంది. గురువారం ఉదయం ఎచ్చెర్ల నియోజకవర్గం జి.సిగడం మండలం దవలపేట గ్రామానికి భువనేశ్వరి చేరుకున్నారు. ఈ సందర్భంగా భువనేశ్వరికి పొలిట్‌బ్యూరో సభ్యుడు కళా వెంకట్రావు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబు అక్రమ అరెస్ట్ సందర్భంగా మనస్థాపంతో మృతి చెందిన కాంచరాన అసిరి నాయుడు కుటుంబ సభ్యులను భువనేశ్వరి పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులకు రూ.3 లక్షలు చెక్కును భువనేశ్వరి అందజేశారు.



## సీఎల్పీ నేతల సమావేశం ప్రారంభం

ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రాల ఇంచార్జ్,రాష్ట్రాల పీసీసీ ప్రెసిడెంట్స్, సీఎల్పీ నేతల సమావేశం ప్రారంభమైంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన సమావేశం జరుగుతోంది. సమావేశానికి అగ్రనేత రాహుల్ గాంధీ,ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసి వేణుగోపాల్ హాజరయ్యారు. రాహుల్ గాంధీ భారత్ న్యాయ యాత్ర ఏర్పాట్లు, 2024 లోక్ సభ ఎన్నికల కసరత్తుపై సమావేశంలో చర్చించనున్నారు. భారత్ న్యాయ యాత్ర ఈశాన్య రాష్ట్రం మణిపూర్ నుంచి మహారాష్ట్ర వరకు కొనసాగనుంది. 14 రాష్టాలు 85 జిల్లాల మీదగా భారత్ న్యాయ యాత్ర కొనసాగనుంది. జనవరి 14 నుంచి మార్చి 20 వరకు భారత్ న్యాయ యాత్రకు కాంగ్రెస్ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు.

## రెండు వర్గాల మధ్య ఘర్షణ.. ఆపడానికి వెళ్లిన పోలీసులపై కాల్పులు

ఉత్తరప్రదేశ్‌లోని కాస్‌గంజ్ జిల్లాలో ఉన్న రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకున్నది. దానిని ఆపడానికి వెళ్లిన పోలీసులపై కాల్పులు జరపడంతో సికందర్‌పూర్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ తీవ్రంగా గాయపడ్డారు. సికిందర్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎద్దుల విషయమై రెండు సాయుధ గ్రూప్‌ల మధ్య కాల్పులు జరుగుతున్నాయని సమాచారం అందుకున్న సికందర్‌పూర్ ఎస్‌హెచ్‌వో హరిభన్ సింగ్ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. బుల్లెట్ దూసుకెళ్లడంతో ఆయన పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన చికిత్స కోసం అలీగఢ్ మెడికల్ కాలేజీకి తరలించినట్లు తెలిపారు. కాల్పుల అనంతరం ఓ గ్రూప్ అక్కడి నుంచి పారిపోయిందని, వారికోసం గాలిస్తున్నామని వెల్లడించారు.

# గడువు పొడిగించిన ఈపీఎఫ్‌వో


అధిక వేతనాలపై పెన్షన్ కోసం ఆప్షన్‌ల ధ్రువీకరణ కోసం ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ గడువును మరోసారి పొడిగించింది. పెన్షన్ కోసం ఉద్యోగులు సమర్పించిన లక్షలాది దరఖాస్తులు యాజమాన్యాల దగ్గర పెండింగ్ ఉండటంతో గడువు పొడిగించే ప్రతిపాదనను ఈపీఎఫ్‌వో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ ఆమోదించింది. అధిక వేతనాలపై పెన్షన్ కోసం ఆప్షన్ లేదా జాయింట్ ఆప్షన్‌ల ధ్రువీకరణ కోసం దరఖాస్తులను సమర్పించడానికి ఈపీఎఫ్‌వో గతంలో ఆన్‌లైన్ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. 2022 నవంబర్ 4 నాటి సుప్రీం కోర్ట్ ఆర్డర్‌కు అనుగుణంగా అర్హులైన పెన్షనర్లు/సభ్యుల కోసం 2023 ఫిబ్రవరి 26న ఈ సదుపాయాన్ని ప్రారంభించింది. 2023 మే 3 వరకు మాత్రమే ఇది అందుబాటులో ఉండగా ఉద్యోగుల అభ్యర్థన మేరకు గడువును మరో నాలుగు నెలలు అంటే 2023 జూన్ 26 వరకు పొడిగించింది. ఆ తర్వాత 2023 జూలై 11 వరకు 15 రోజుల అవకాశం ఇచ్చింది. 2023 జూలై 11 నాటికి ఆప్షన్/జాయింట్ ఆప్షన్‌ల ధ్రువీకరణ కోసం పెన్షనర్లు/సభ్యుల నుంచి 17.49 లక్షల దరఖాస్తులు వచ్చాయి.




దరఖాస్తుదారు పెన్షనర్లు/సభ్యుల వేతన వివరాలను అప్‌లోడ్ చేయడానికి వ్యవధిని పొడిగించాలని ఎంప్లాయర్స్ & ఎంప్లాయర్స్ అసోసియేషన్‌ల నుంచి అభ్యర్థనలు రావడంతో యజమానులకు వేతన వివరాలను ఆన్‌లైన్‌లో సమర్పించడానికి 2023 సెప్టెంబరు 30 వరకు సమయం ఇచ్చింది. ఇది మళ్లీ 2023 డిసెంబర్ 31కి జరిగింది. ఆ తర్వాత కూడా ఆప్షన్/జాయింట్ ఆప్షన్‌ల ధ్రువీకరణ కోసం 3.6 లక్షల కంటే ఎక్కువ దరఖాస్తులు ప్రాసెసింగ్ కోసం యజమాన్యాల వద్ద ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి.

# ఇస్రో చైర్మన్ సోమనాథ్‌కు గౌరవ డాక్టరేట్..

## జేఎన్‌టీయూ ప్రకటన



చంద్రయాన్-3 మిషన్‌ను విజయవంతంగా నిర్వహించిన ఇస్రో చీఫ్ శ్రీధర పనికర్ సోమనాథ్‌కు తెలంగాణ జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ) గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. వర్సిటీ 12వ స్నాతకోత్సవం సందర్భంగా దీన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు వైస్ ఛాన్సలర్ ప్రొ.కట్టా నరసింహా రెడ్డి తెలిపారు. ఈ నెల 5న నిర్వహించనున్న స్నాతకోత్సవానికి సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. రాష్ట్ర గవర్నర్, JNTU ఛాన్సలర్ తమిళిసై సౌందరరాజన్ అధ్యక్షత వహిస్తారు అనంతరం డాక్టర్ సోమనాథ్ స్నాతక ప్రసంగం చేస్తారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన 54 మంది విద్యార్థులు, పరిశోధకులకు బంగారు పతకాలు, డిగ్రీ పూర్తి చేసిన 88,226 మంది ఇంజినీరింగ్, ఎంటెక్ విద్యార్థులకు పట్టాలు అందజేయనున్నట్లు తెలిపారు.విదేశీ యూనివర్సిటీలతో ఒప్పందాలు. జేఎన్‌టీయూలో బీటెక్ చదువుతున్న విద్యార్థులు ఐదేళ్లలోపు డ్యూయల్ డిగ్రీ పొందేలా అమెరికా సహా ఇతర దేశాల్లోని పది యూనివర్సిటీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని వివరించారు.


సూర్య | www.suryaa.com | EVENING EDITION 4PM



ఐదు లక్షల మంది అక్రమ వలసదారులను

## వెనక్కి పంపిన పాకిస్థాన్

పాకిస్థాన్ ప్రభుత్వం చేపట్టిన బహిష్కరణ డ్రైవ్‌లో భాగంగా ఇప్పటికే 5 లక్షల మందికి పైగా అక్రమ వలసదారులను దేశం నుంచి బహిష్కరించినట్లు పాక్ హోం మంత్రిత్వ శాఖ పార్లమెంటు ఎగువ సభ (సెనేట్)కి తెలియజేసింది. స్వదేశానికి రప్పించడం, బహిష్కరణ ప్రచారం యొక్క ప్రస్తుత స్థితికి సంబంధించి సెనేటర్ మొహ్సిన్ అజీజ్ ప్రశ్నలకు మంత్రిత్వ శాఖ సమాధానం ఇచ్చింది. పాక్ లో దాదాపు 17 లక్షల మంది అక్రమ వలసదారులు నివసిస్తున్నారని, వీరిలో ఎక్కువ మంది ఆఫ్ఘన్‌లు ఉన్నారని వెల్లడించింది. దేశంలో ఉండేందుకు ఎలాంటి చట్టపరమైన పత్రాలు లేకుండానే అక్రమంగా జీవిస్తున్నారని పేర్కొన్నారు. అక్రమ నివాసితుల బహిష్కరణ ప్రణాళికకు క్యాబినెట్ ఆమోదం తెలిపిన తర్వాత దాదాపు 5 లక్షల 41 వేల 210 మంది బహిష్కరణకు గురయ్యారు అని పాకిస్థాన్ చెప్పకొచ్చింది. మిగిలిన 1.15 మిలియన్లు ఇప్పటికీ నివాసం ఉంటున్నారు.. ప్రభుత్వం దేశవ్యాప్త బహిష్కరణ ప్రచారంలో భాగంగా మిగిలిన వారిని కూడా స్వదేశానికి పంపించివేయనున్నారు. అయితే, మిగిలిన వారిని గుర్తించి వెనక్కి పంపించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని పాకిస్థాన్ ప్రభుత్వం తెలిపింది. తమ స్వదేశాలకు పంపబడిన 5 లక్షల మంది అక్రమ వలసదారులలో 95 శాతానికి పైగా ఆఫ్ఘన్ పౌరులే ఉన్నారని సోర్సెస్ ధృవీకరించాయి. దశాబ్దాలుగా దేశంలో నివసిస్తున్న దాదాపు 1.7 మిలియన్ల అక్రమ వలసదారులను బహిష్కరించాలని పాకిస్థాన్ లక్ష్యంగా పెట్టుకుంది. చాలా మంది అక్రమ వలసదారులు ఆఫ్ఘన్ పౌరులు, భద్రతా సమస్యల కారణంగా తమ దేశం నుంచి పారిపోయారు. ఇక, ప్రపంచ మానవ హక్కుల సంస్థలు లేదా ఆఫ్ఘన్ ప్రభుత్వం లేవనెత్తిన ఆందోళనలపై స్పందించేందుకు పాకిస్థాన్ ప్రభుత్వం నిరాకరించింది. అక్రమ వలసదారులు ప్రవాహాన్ని తీవ్రవాద గ్రూపులతో పాటు వారి మిలిటెంట్లు దేశంలోకి ప్రవేశించడానికి, దాడులు చేయడానికి ఒక సాధనంగా ఉపయోగించుకున్నారని ఆరోపిస్తున్నారు. అక్రమ వలసదారులకు ఆశ్రయం కల్పించేందుకు తమ జాతీయ భద్రత విషయంలో రాజీపడే పరిస్థితి లేదని పాకిస్థాన్ ప్రకటించింది.



# అమెరికాలో కరోనా విజృంభణ

అమెరికాలో కరోనా కేసులు వేగంగా పెరుగుతున్నాయి. యూఎస్ అంతటా డిసెంబర్ 17-23 వరకు కోవిడ్ కారణంగా 29 వేల మంది రోగులు ఆసుపత్రిలో చేరారు. ఈ సమయంలో 14 వేల 700 మంది రోగులు జ్వరం కారణంగా ఆసుపత్రిలో జాయిన్ అయ్యారు. అమెరికాలో కరోనా వ్యాప్తి చెందకుండా ఉండేందుకు కొన్ని రాష్ట్రాలు మాస్కులు ధరించడం తప్పనిసరి చేశాయి. న్యూయార్క్, కాలిఫోర్నియా, ఇల్లినాయిస్ తో పాటు మసాచుసెట్స్‌లోని ఆసుపత్రులలో రోగులు మాస్క ధరించడం తప్పనిసరి చేసింది. ఇక, సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ డేటా ప్రకారం.. అమెరికాలో కరోనా కారణంగా 11 లక్షల మంది రోగులు మరణించారు. చికాగోలోని రష్ యూనివర్శిటీ మెడికల్ సిస్టమ్ కూడా ఆసుపత్రి క్యాంపస్‌లో రోగులతో పాటు ఆరోగ్య కార్యకర్తలు మాస్కులు తప్పనిసరి చేసింది. గత వారం న్యూయార్క్ నగరం నగరంలోని 11 ప్రభుత్వ ఆసుపత్రులకు మాస్కులు ధరించాలని చెప్పింది.. లాస్ ఏంజిల్స్, మసాచుసెట్స్‌లోని కొన్ని ఆసుపత్రులలో ఇలాంటి చర్యలు గత వారం నుంచి కొనసాగుతున్నాయి. అయితే, పెరుగుతున్న కోవిడ్ కేసుల కారణంగా భయపడాల్సిన అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు. నూతన సంవత్సర సెలవుల తర్వాత అమెరికన్లు రోజువారీ జీవితంలోకి తిరిగి వస్తున్నారు. ఈ నేపథ్యంలో కరోనాతో పాటు జ్వరాలు రాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. జపాన్, భారత్ తో పాటు అనేక దేశాలలో కరోనా జెఎన్.1 వేరియంట్ కేసులు వేగంగా పెరుగుతున్నాయి. ఈ వేరియంట్‌పై అమెరికా కూడా ఆందోళన చెందుతోంది.



బీజేపీ అధిష్టానం

## సంచలన నిర్ణయం..

### కిసాన్ మోర్చా ఇంచార్జ్‌గా బండి సంజయ్

లోక్‌సభ ఎన్నికలకు సమయం దగ్గరపడుతోంది. దీంతో 400ల స్థానాలు టార్గెట్ గా.. కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) వ్యూహాలతో ముందుకువెళ్తోంది. ఉత్తరాదితోపాటు.. ప్రధానంగా దక్షిణాది రాష్ట్రాల్లో కూడా పట్టు సాధించాలని ప్రయత్నాలను ముమ్మరం చేసింది. 2019లో నాలుగు స్థానాలను దక్కించుకున్న తెలంగాణలో కూడా ఎక్కువ స్థానాల్లో పాగా వేసేందుకు సమాయత్తమవుతోంది.. ఈ క్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ కు బీజేపీ కీలక బాధ్యతలను అప్పగించింది. బండి సంజయ్ ను కిసాన్ మోర్చా ఇంఛార్జ్‌గా నియమించింది. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండడంతో బీజేపీ సంస్థాగత విభాగాలను పునర్వ్యవస్థీకరిస్తూ బీజేపీ అధిష్టానం ప్రకటనను విడుదల చేసింది. బుధవారం కీలక విభాగాలకు కొత్త ఇన్‌ఛార్జులను నియమించింది. ఇందులో పార్టీ సీనియర్లు బండి సంజయ్ కుమార్, సునీల్ బన్సల్, తరుణ్ చుగ్ సహా పలువురికి కీలక బాధ్యతలను బీజేపీ హైకమాండ్ అప్పగించింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదేశాల మేరకు మొత్తం 7 పార్టీ అనుబంధ విభాగాలకు కొత్త ఇన్‌ఛార్జిలను నియమిస్తూ పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ ఉత్తర్వులు జారీచేశారు. ఇందులో మహిళా మోర్చా ఇన్‌ఛార్జిగా పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు బైజయంత్‌పాండాను నియమించారు. కిసాన్ మోర్చా ఇంఛార్జ్‌గా బండి సంజయ్ ను నియమించింది. దీంతోపాటు యువ మోర్చా ఇన్‌ఛార్జిగా సునీల్ బన్సల్, ఎస్సీ మోర్చా ఇన్‌ఛార్జిగా తరుణ్ చుగ్, ఎస్టీ మోర్చా ఇన్‌ఛార్జిగా రాధా మోహన్ దాస్ అగర్వాల్, ఓబీసీ మోర్చా ఇన్‌ఛార్జిగా వినోద్ తావ్డే, మైనార్టీ మోర్చా ఇన్‌ఛార్జిగా దుశ్యంత్ కుమార్ గౌతమ్‌లను నియమిస్తూ అరుణ్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా.. కరీంనగర్ ఎంపీగా ఉన్న బండి సంజయ్ ను గతంలో తెలంగాణ అధ్యక్ష బాధ్యతలనుంచి తప్పించిన తర్వాత బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించింది.. ఆ తర్వాత ఇప్పుడు అధిష్టానం కీలకమైన కిసాన్‌మోర్చా ఇన్‌ఛార్జిగా నియమించింది.

## గ్లామర్‌తో సెగలు పుట్టిస్తున్న శ్వేతా శర్మ



ఈ అమ్ముడు కొన్ని ఫొటోలను పోస్ట్ చేసింది. ఈ ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయ్.లేటెస్ట్ గా శ్వేతా శర్మ షేర్ చేసిన వైట్ కలర్ టూ పీస్ బికినీ ఫోటోలు సోషల్ మీడియాలో మంటలు రేపుతున్నాయ్. ఫోటోలను పంచుకోవడంతో పాటు " మీ చిరునవ్వు మిమ్మల్ని మరింత అందంగా చేస్తోంది " అని క్యాప్షన్ ఇచ్చింది.నటి శ్వేతా శర్మకు లక్షల్లో ఫాలోవర్లు ఉన్నారు. ఆమె ఏ పోస్ట్ షేర్ చేసినా క్షణాల్లో వైరలవుతుంది. ఆమె షేర్ చేసే ఫోటోలకు వేలల్లో లైకులు, కామెంట్ల వర్షం కురుస్తోంది.



## జేబులో పేలిన సెల్‌ఫోన్.. యువకుడికి తీవ్రగాయాలు

బైకు పైన వెళ్తున్న యువకుడి జేబులోని మొబైల్ ఫోన్ ఒక్కసారిగా పేలింది. ఈ ఘటన బెంగళూర్ లోని వైట్‌ఫీల్డ్ ప్రాంతంతో బుధవారం చోటు చేసుకుంది. తీవ్రంగా గాయపడిన యువకుడిని ప్రసాద్‌గా గుర్తించారు. ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న ప్రసాద్ బుధవారం బైక్‌పై వెళ్తూ తన మొబైల్‌ని ప్యాంట్ జేబులో పెట్టుకున్నాడు. ఆ సమయంలో మొబైల్ ఒక్కసారిగా పేలింది. పేలుడు వల్ల నడుము కింది భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై వైట్ ఫీల్డ్ పోలీసులు కేసు నమోదు చేశారు. మొబైల్ ఫోన్ పేలిన ఘటన ప్రసాద్ మొబైల్ కొనుగోలు చేసిన షోరూం దృష్టికి వచ్చింది. ప్రసాద్ వైద్యానికి అయ్యే చిన్న చిన్న ఖర్చులను భరిస్తామని, మొబైల్ డబ్బుల్ని తిరిగి ఇప్పిస్తామని హామీ ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన భాగానికి శస్త్రచికిత్స చేయాల్సి ఉందని, రూ. 4 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. చికిత్సకు అయ్యే ఖర్చు మొత్తాన్ని షోరూం భరించాలని యువకుడి బంధువులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. అయితే పూర్తిగా డబ్బులు చెల్లించేందుకు షోరూం సిద్ధంగా లేనట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో మొబైల్ ఫోన్లు పేలిపోతున్న సంఘటనలు జరుగుతున్నాయి. గతేడాది సెప్టెంబర్ నెలలో కర్ణాటక షియోగాలోని సొరబ తాలూకాలో కూడా ఇలాగే బైక్‌పై వెళ్తున్న యువకుడి ప్యాంట్ జేబులోని మొబైల్ ఫోన్ పేలింది. పేలుడు కారణంగా బైక్ అదుపుతప్పి సమీపంలోని చెరువులోకి దూసుకెళ్లింది. కేరళలోని త్రిస్సూర్ జిల్లాలో 76 ఏళ్ల వృద్ధుడి జేబులో ఫోన్ పేలింది.

## తొలి మ్యాచ్‌లో సాధ్యంకానిది.. ఈసారి చేసి చూపా: సిరాజ్



కేప్‌టౌన్‌లో దక్షిణాఫ్రికాను 55 పరుగులకే కుప్పకూల్చడంలో భారత బౌలర్ మహమ్మద్ సిరాజ్ కీలక పాత్ర పోషించాడు. తొమ్మిది ఓవర్లలో 15 పరుగులు ఇచ్చి ఆరు వికెట్లను పడగొట్టాడు. రెండో టెస్టులో భారత్, దక్షిణాఫ్రికా బౌలర్ల దెబ్బకు ఒకే రోజు 23 వికెట్లు కూలాయి. దీంతో టీమ్‌ఇండియా తొలి రోజే రెండోసారి బౌలింగ్ ప్రారంభించడం గమనార్హం. మొదటి రోజు మ్యాచ్ ముగిసిన అనంతరం సిరాజ్ మాట్లాడాడు. 'ఒకే రోజు రెండు ఇన్నింగ్స్‌ల్లో బౌలింగ్‌కు వస్తావని ఊహించావా?' అనే ప్రశ్నకు సమాధానం ఇచ్చాడు. రెండో ఇన్నింగ్స్‌లో సిరాజ్ ఐదు ఓవర్లు వేసి 11 పరుగులు ఇచ్చాడు. ఇంకా వికెట్ తీయలేదు. "నిజంగా ఒకే రోజు రెండు ఇన్నింగ్స్‌ల్లో బౌలింగ్ చేస్తామని అనుకోలేదు. ఇప్పటికైతే మ్యాచ్‌లో మేం ఒకడుగు ముందే ఉన్నాం. క్రికెట్‌లో సానుకూల, ప్రతికూల పరిస్థితులుంటాయి. ఈ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో నా ప్రదర్శన పట్ల సంతోషంగా ఉన్నా. కొత్త ఏడాదిని ఘనంగా ప్రారంభించానని అనుకుంటున్నా. గత మ్యాచ్‌లో నేను ఏం చేయలేకపోయానో.. ఇప్పుడు ఈ టెస్టులో అది చేసి చూపించా. ఒకే విధమైన బంతులు నిలకడగా వేసి ఫలితం సాధించా. సెంచూరియన్ మాదిరిగానే కేప్ టౌన్ కూడా పేస్‌కు అనుకూలంగా ఉంది. తొలి టెస్టు మాదిరిగా కాకుండా.. ఈసారి బుమ్రాతో కలిసి కొన్ని మెయిడిన్లు వేశాం. దీంతో ప్రత్యర్థిపై ఒత్తిడి పెరిగింది. ఇలాంటి పిచ్‌పై నిలకడగా లెంగ్త్‌తో బౌలింగ్ చేస్తే తప్పకుండా వికెట్లు దక్కుతాయని తేలింది. అలా కాకుండా వైవిధ్యం కోసం ప్రయత్నిస్తే అయోమయానికి గురికావాల్సి ఉంటుంది. మరోవైపు సీనియర్ బౌలర్, వికెట్ కీపర్ ఇచ్చే సూచనలూ చాలా కీలకం. సరైన లెంగ్త్‌తో బంతులు వేస్తే వికెట్లు వస్తాయనేది పసిగడితే చాలు. అందుకే తరచూ వారితో చర్చిస్తూ ఉంటే మన పని ఇంకా తేలికవుతుంది. ఒకవేళ మన బౌలింగ్‌లో నాలుగైదు బౌండరీలు కొట్టినా.. వికెట్ కోసం ఏ లెంగ్త్‌లో బంతిని వేయాలనేది తెలుస్తుంది. రెండో రోజు ఏం జరుగుతుందనేది ఇప్పుడే చెప్పలేను. ప్రస్తుతం మేం ఇంకా 36 పరుగుల ఆధిక్యంలోనే ఉన్నాం. వారిని త్వరగా ఆలౌట్ చేసి లీడ్ సాధించకుండా చూస్తాం" అని సిరాజ్ తెలిపాడు. తొలి టెస్టులో 91 పరుగులు ఇచ్చి రెండు వికెట్లను మాత్రమే తీశాడు.



## మస్క్ కొనుగోలు తర్వాత 'ఎక్స్' విలువ 71% పతనం!

సామాజిక మాధ్యమ దిగ్గజం 'ఎక్స్' విలువ గణనీయంగా పడిపోయినట్లు ప్రముఖ పెట్టుబడుల సంస్థ నివేదిక వెల్లడించింది. యూజర్ల సంఖ్య తగ్గడం, వాణిజ్య ప్రకటనల ఆదాయంలో కుంగుబాటు, కంటెంట్‌పై ఆందోళనలు వంటివి దీనికి కారణమని పేర్కొంది. 'ఎక్స్'ను బిలియనీర్ ఎలాన్ మస్క్ 2022 అక్టోబర్‌లో 44 బిలియన్ డాలర్లకు సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ మొత్తంతో పోలిస్తే కంపెనీ విలువ 2023 డిసెంబర్ 30 నాటికి 12.5 బిలియన్ డాలర్లకు పతనమైనట్లు ఫిడెలిటీ వెల్లడించింది. అంటే 71.5 శాతం కంపెనీ విలువ ఆవిరైంది. మస్క్ దాన్ని సొంతం చేసుకున్న కొన్ని నెలల్లోనే యూజర్ల సంఖ్య 15 శాతం తగ్గినట్లు తెలిపింది. ట్విటర్ పేరును 'ఎక్స్'గా మార్చడం సహా మస్క్ హయాంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. దాదాపు 50 శాతం మంది ఉద్యోగులను తొలగించారు. కంటెంట్ నియంత్రణ విషయంలో ఉదార విధానాలను అమలు చేస్తున్నారు. ఈ క్రమంలో తప్పడు సమాచారం 'ఎక్స్'లో ఎక్కువవుతోందనే ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఇతర దిగ్గజ సామాజిక మాధ్యమాలతో పోలిస్తే 'ఎక్స్'లోనే తప్పడు సమాచారం అధికమని గత సెప్టెంబర్‌లో ఐరోపా సమాఖ్య హెచ్చరించింది.

## రామాలయంతో సహా పేల్చేస్తామంటూ సీఎం యోగికి బెదిరింపులు

అయోధ్యలో నిర్మించిన రామ మందిరంతో సహా ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను పేల్చివేస్తామంటూ బెదిరింపులు వచ్చాయి. మరికొన్ని రోజుల్లో రామ మందిరంలో ప్రాణ ప్రతిష్ఠ జరగనున్న వేళ ఇవి కలకలం రేపుతున్నాయి. ఈ కేసులో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. నిందితులిద్దరూ పేలుళ్లకు పాల్పడతామని సోషల్‌మీడియా వేదికగా పోస్టు పెట్టారు. సీఎంతో పాటు ఎస్‌టీఎఫ్ చీఫ్ అమితాబ్ యశ్‌ను కూడా హత్య చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోస్టు ఆధారంగా నిందితులకు సంబంధించిన మెయిల్ అడ్రస్‌లను కనుగొన్నారు. వీటిపై సాంకేతిక విశ్లేషణ అనంతరం నిందితులను ఓం ప్రకాశ్, తాహర్ సింగ్‌లుగా గుర్తించారు. వెంటనే పోలీసులు వారిని అరెస్టు చేశారు. గోండాకు చెందిన వీరిద్దరూ పారామెడికల్ ఇనిస్టిట్యూట్‌లో పని చేస్తున్నారని తెలిపారు. తాహర్ సింగ్ మెయిల్స్‌ను సృష్టించగా.. ప్రకాశ్ బెదిరింపులకు పాల్పడినట్టు తెలుస్తోంది.